క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామికి విశేష పూజలు



మద్దిక్షేత్రంలో స్వామి వారి ఉత్సవ మూర్తితో ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్న వరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారికి తమల పాకులతో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తిని క్షేత్ర పురవీధుల్లో ప్రదక్షిణలు చేస్తూ ఆలయ ముఖ మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. వెయ్యి మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కె. రంగరావు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో విశాఖపట్నం డీసీపీ



డీసీపీ శ్రీనివాస్‌కు శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణస్వామి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

సందర్శకుల తాకిడి

బుట్టాయగూడెం: దసరా సెలవులు, ఆదివారం కావడంతో ఏజెన్సీ ప్రాంతంలోని పలు పర్యాటక ప్రదేశాల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా కనిపించింది. గుబ్బల మంగమ్మగుడి, జల్లేరు జలాశయం, ముంజులూరు జలపాతం తదితర ప్రాంతాల్లో జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి అనేక మంది సందర్శకులు ఆయా ప్రదేశాలను సందర్శించి ఆనందంగా గడిపారు. ప్రకృతి రమణీయమైన దృశ్యాలు చూసి పులకించిపోయారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సెల్ఫీలు దిగారు.


పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. స్థానిక సాయి లక్ష్మీనగర్‌లో నిర్వహించిన ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రెండు మోటార్‌సైకిళ్లు, 6 సెల్‌ఫోన్లు, రూ.29 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్. మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

దెందులూరు: చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు వడ్లపట్ల కస్తూరిమాత మెమోరియల్ ట్రస్టు చైర్మన్ వడ్లపట్ల సత్యనారాయణ, వడ్లపట్ల ప్రసాద్, వడ్లపట్ల రామచందర్ అన్నారు. కొవ్వలిలో సేవా కార్యకర్త సీనియర్ ఉపాధ్యాయులు వడ్లపట్ల విజయ్‌కుమార్‌తో కలిసి 2023లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 30,000 అందించారు. కొవ్వలి గ్రామానికి చెందిన గొరిపర్తి శ్రీదేవికి రూ.8 వేలు, కాపుదాసు ప్రదీప్, బీ.మాధవిచరిష్మా, పిల్లి కిరణ్మయి, ముసునూరు సాయివెంకటేష్, పుట్ట ఈశ్వర్‌కు కొవ్వలి పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, రాచూరి జెడ్పీస్కూల్ హెచ్‌ఎం వడ్లపట్ల విజయకుమార్‌తో కలిసి స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

పార్వతీ రామచంద్రన్‌కు సన్మానం



సన్మానిస్తున్న గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ అధ్యక్షురాలు, నాట్య మయూరి ఎ. పార్వతీ రామచంద్రన్ కూచిపూడి నాట్య రంగంలో చేసిన సేవలకు గానూ ఆమెను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఘనంగా సన్మానించింది. రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పార్వతీ రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శన అనంతరం పార్వతీ రామచంద్రన్‌ను గరికపాటి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు గరికపాటి కాళిదాసు, ఎంవీఆర్ఎస్ శర్మ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



ద్వారకాతిరుమల: మహిషాసురమర్దని అలంకరణలో వాసవీమాత



జంగారెడ్డిగూడెం: మహంకాళి అవతారంలో గ్రామ దేవత గంగానమ్మ



కొయ్యలగూడెం: దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గ్రామదేవత ఉదయం మహిషాసుర మర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు మహంకాళీ అవతారంలో దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ తల్లి శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చింది. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ ఆధ్వర్యంలో 108 మంది దంపతులచే విశేష శ్రీచక్ర నవావరణ అర్చన, లలితా సహస్రనామ కుంకుమార్చన ప్రధానార్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ తల్లి పూజలందుకుంది. అమ్మవారికి పగడాలు, కనకాంబరాలు, జాజులతో అర్చన నిర్వహించారు. వాసవీ మాతను దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: దుష్టశిక్షణ, శిష్టరక్షణకు అవతరించిన శ్రీ దుర్గాదేవిగా క్షేత్రదేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. పులిని వాహనంగా చేసుకుని ఆయుధ దారిణియై, దుష్టశిక్షణ ఘట్టాన్ని ఆవిష్కరించే విధంగా ఉన్న ఈ అలంకరణలోని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దని దేవిగా భక్తులను కటాక్షించారు.



కుక్కునూరు: బతుకమ్మను పేర్చుతున్న మహిళలు

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణతో పూజలందుకుంది. కొయ్యలగూడెం శ్రీ చక్రసహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక పూజలు నిర్వహించారు. కరాటం వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకరణతో అమ్మవారు పూజలందుకున్నారు. కన్నాపురం , బయ్యగూడెం, రాజవరం, యర్రంపేటతో సహా కనకదుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బుట్టయగూడెం: రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి 11 రకాల నైవేద్యాలు సమర్పించి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా బతుకమ్మల ఊరేగింపు

కుక్కునూరు: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలలో చివరిరోజైన ఆదివారం బతుకమ్మల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మని పురస్కరించుకొని మహిళలు పెద్ద,పెద్ద బతుకమ్మలను పేర్చి వాటిని ఆటోలలో పెట్టి వీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా డీజే పాటలతో నృత్యాలు చేశారు. ఊరేగింపు అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

నేటినుంచి అయ్యప్ప క్షేత్రంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో ఈనెల 23 నుంచి స్వాములకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆదివారం అయ్యప్ప క్షేత్రంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ తమ్మన వెంకటేశ్వరరావు, సెక్రటరీ నెక్కలపూడి సూర్యచంద్రరావు, సభ్యులు గంగు జగన్మోహనరెడ్డి మాట్లాడారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గత 12 ఏళ్లుగా అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయ్యప్ప, భవానీ, శివ, ఆంజనేయస్వామి మాలధారణ చేసిన భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కిడ్నీ బాధితురాలి చికిత్సకు రూ.8 లక్షల సీఎం సహాయ నిధి



రూ.8 లక్షల ఎల్ఓసీని అందిస్తున్న కొఠారు రామచంద్రరావు తదితరులు

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ వైఎస్సార్ సీపీ ఆదుకుని అండగా ఉంటుందని జిల్లా అధికార ప్రతినిధి, ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పెదవేగి మండలం ముండూరుకి చెందిన గౌడ్ దొంత నాగరాజు కుమార్తె దొంత దుర్గమౌనిక (21) చికిత్సకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అండగా నిలిచారని కొఠారు చెప్పారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లాలో వరద ముంపు ప్రాంతాల పర్యటనకు వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, దుర్గమౌనిక విషయం తెలియజేయగా, అప్పటికప్పుడే సీఎం రూ.లక్ష తక్షణ సాయం అందజేశారని తెలిపారు. శస్త్ర చికిత్స కోసం సాయం అందించాలని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కోరగా, సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ నేపథ్యంలో దుర్గమౌనికకు సంబంధించిన రిపోర్టులు సీఎంఓ అధికారులకు సమర్పించి, పలుమార్లు వారితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడటంతో బాధితురాలి శస్త్ర చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.7 లక్షలు ఎల్ఓసీ మంజూరైందని తెలిపారు. సంబంధిత ఎల్ఓసీ పత్రాన్ని కొఠారు రామచంద్రరావు కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం దుర్గ మౌనిక కుటుంబ సభ్యులకు అందజేశారు. రూ.8 లక్షల సాయం అందించిన సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి దుర్గ మౌనిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

శరవేగంగా డ్రెయినేజీల నిర్మాణ పనులు



కొయ్యలగూడెంలో నిర్మాణంలో ఉన్న కొవ్వూరు రోడ్డు డ్రెయినేజీ, పోలవరం రోడ్డు డ్రెయినేజీ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి శ్రీకారం ఏర్పడింది. పోలవరం రోడ్, కొవ్వూరు రోడ్‌లలో హైవేలకు ఆనుకుని డ్రెయినేజీల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. పోలవరం రోడ్డులో గ్రంథాలయం నుంచి 220 మీటర్ల పొడవునా చింతాలమ్మ గుడి వరకు డ్రెయినేజీ నిర్మాణం కొనసాగుతోంది. 3 చోట్ల కల్వర్టులతో సహా ఇప్పటికే కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రూ.10 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేయగా, ఎంపీ కోటగిరి శ్రీధర్ తన నిధుల నుంచి రూ.10 లక్షలు విడుదల చేశారు. దీంతో రూ.20 లక్షలతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అయితే గణేష్ సెంటర్ వరకు డ్రెయినేజీ నిర్మాణాన్ని పొడిగించడానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎస్టిమేట్ పనులు పూర్తిచేసి ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మరో రూ. 20లక్షలు గ్రాంటు అవసరం కానుంది. అదేవిధంగా కొవ్వూరు రోడ్డులో రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. ఈ రెండు డ్రెయినేజీ నిర్మాణాలతో కొయ్యలగూడెం ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ రెండు ప్రధాన డ్రెనేజీలు లేకపోవడం వల్ల వర్షాల సమయంలో గ్రామం ముంపు బారిన పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు డ్రెయినేజీల నిర్మాణం పూర్తయితే 40 దశాబ్దాల సమస్యకు పరిష్కారం కాగలదని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తా

చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

చింతలపూడి: వరి రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. మండలంలోని సమ్మెటవారిగూడెం, మల్లాయగూడెం, ఏపీ అగ్రహారం గ్రామాల్లో వర్షాభావంతో ఎండిపోతున్న వరి పొలాలను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆదివారం పరిశీలించారు. గత నెల రోజులుగా సరైన వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆయన వద్ద వాపోయారు. అనంతరం ఎలీజా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. ప్రభుత్వం తరుపున రైతులకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం ధాన్యం రైతులకు మద్దతు ధర నేరుగా అందించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయశాఖ ఏడీ బి నాగకుమార్, ఏఓ మీనాకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, నాయకులు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, తాంద్ర రామకృష్ణారావు, ఎస్ దుర్గారావు, కొప్పుల నాగేశ్వరరావు, ఎస్.కాంతారావు, యడ్ల మోహన్‌రావు, జంగా చెన్నకేశవరెడ్డి, సీహెచ్ నాగేశ్వరరావు, కె యువరాజు, గోల్కొండ సురేష్ పాల్గొన్నారు.



సమ్మెటవారిగూడెంలో ఎండిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

వ్యవసాయ శాఖ మంత్రి కాకాని హామీ

మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాని గోవర్ధనరెడ్డికి ఫోన్‌లో వివరించినట్లు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా తెలిపారు. ఈ విషయంపై సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి కాకాని హామీ ఇచ్చినట్లు ఎలీజా చెప్పారు.

ఘనంగా కొమరం భీమ్, ఎస్ఆర్ శంకరన్ జయంతి

బుట్టాయగూడెం: ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ (ఏజేఏసీ), ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం కొమరం భీమ్, ఎస్ఆర్ శంకరన్ జయంతిని నిర్వహించారు. స్థానిక కోట రామచంద్రాపురం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భీమ్, శంకరన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం పాలకులకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేసి హక్కులు సాధించడంలో కొమరం భీమ్ పోరాటం ఎనలేనిదన్నారు. అలాగే ఎస్ఆర్ శంకరన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఆదివాసీల బతుకులలో వెలుగులు నింపిన ఆ మహానుభావులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని, వారి త్యాగాల నుంచి స్ఫూర్తిని పొంది ఆదివాసిల హక్కులను కాపాడుకోవడానికి సంసిద్ధులుగా ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ గౌరవ సలహాదారులు కొవ్వాసి శ్రీనివాసరావు, ఏటీఏ గౌరవ అధ్యక్షుడు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షుడు సోడెం రాజు, ఆదివాసి ఐక్య కార్యాచరణ కమిటీ, వైస్ చైర్మన్ కుర్సం దుర్గారావు, ఆదివాసి మహాసభ నాయకులు మూలెం రాంబాబు, ఆదివాసి మెడికల్–హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పండు చినబాబు, ఏఎస్‌పీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సోడెం మల్లయ్య, నాయకులు సోడెం ముఖేష్, తెల్లం రవిప్రసాద్, పైదా పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీమ్, ఎస్ఆర్ శంకరన్‌లకు నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్
- ఘనంగా శ్రీధర్ జన్మదిన వేడుకలు
- కామవరపుకోట నుంచి శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర
- పాదయాత్రలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు

కామవరపుకోట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆదివారం కామవరపుకోట నుంచి ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర నిర్వహించారు. ఆయన తన పుట్టినరోజు పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. స్థానిక స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ఎంపీ శ్రీధర్ పూజలు నిర్వహించి అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించారు. పార్టీ నేతలు, అభిమానులు ఎంపీ శ్రీధర్‌చే కేక్ కట్ చేయించారు. జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఎంపీ శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, కామవరపుకోట సర్పంచ్ కె.అనూష, ఉపసర్పంచ్ మేడూరు రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

ద్వారకాతిరుమల: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్రకు దారి పొడవునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సుమారు 4 వేల మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో తీన్మార్ డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఈ యాత్ర సాగింది. ఎంపీ శ్రీధర్ శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఎంపీ శ్రీధర్ చేత కేక్ కట్‌చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, తదితరులున్నారు.



కామవరపుకోట: సొసైటీ పెట్రోల్ బంకులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీధర్ తదితరులు

లింగపాలెం: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్రకు ఆదివారం లింగపాలెం మండలం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈమేరకు పార్టీ నేత రెడ్డిన శ్రీను ఇంటి ఆవరణలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. అనంతరం బైక్‌లు, కార్లు, ఆటోల్లో పెద్ద ఎత్తున ర్యాలీగా కామవరపుకోటకు తరలి వెళ్లారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు ఉపాధ్యక్షుడు దయాల నవీన్‌బాబు, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకి జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మద్ది ఆంజనేయస్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు రాఘవరాజు ఆదివిష్ణు, కనికెళ్ల ప్రసాద్ బాబు, బుడేకుల పాపారావు, గోలి ప్రసాదరెడ్డిలు ఎంపీ పాదయాత్రలో పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: కేక్ కట్ చేస్తున్న ఎంపీ శ్రీధర్, పాల్గొన్న ఆళ్ల నాని, తలారి, ప్రతాప్ అప్పారావు తదితరులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు ఎంపీ కోటగిరి పాదయాత్రలో వైఎస్సార్ సీపీ వైసీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా కార్యదర్శి డా.కఠారి సీతారాంబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎంపీ శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు కఠారి వీర్రాజు, ఇర్ల శ్రీనివాస రెడ్డి, కందుల కృష్ణ, అత్యం రవి, సీహెచ్ రవి, పి.శ్రీనివాసరెడ్డి, బి.పిచ్చయ్య పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల ప్రజాప్రతినిధులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుమూర్తి, రాష్ట్ర సర్పంచ్‌ల ఛాంబర్ ఉపాధ్యక్షులు ఏలేటి చిన తుక్కయ్య అభినందనలు తెలిపి జ్ఞాపికను అందజేశారు.

కుక్కునూరు: కుక్కునూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్రకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు ఆధ్వర్యంలో మండల నాయకులు రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, కృష్ణం రాజు, మల్లేల చంటినాయుడు, సూర్ల రాము తదితరులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.